తెలంగాణ ట్రాన్స్‌కో యూనియన్ నూతన కార్యవర్గం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ట్రాన్స్‌కో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.తులసీరాం, కార్యదర్శిగా ఎస్.బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సి.నాగరాజు, అదనపు కార్యదర్శిగా కె.రామచంద్రం ఎన్నికల్లో గెలుపొందారు. ఈ ఎన్నికలను 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్, అదనపు కార్యదర్శి వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో జరిగినట్లు యూనియన్ కార్యదర్శి ఎస్.బాలకృష్ణ తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను తమ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

నల్లకుంట: టీఆర్టీ కాలనీలోని శ్రీదుర్గామాత ఆలయం పునర్ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి, ఆలయం పాలక మండలి అధ్యక్షుడు నరేష్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు

నల్లకుంట: గీతా జయంతిని పురస్కరించుకొని వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠంలో ధారణ శిబిరం విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠనంపై పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఎంతో చక్కగా శ్లోకాలు పఠించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు, ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్రం బాగ్‌లింగంపల్లి శాఖ ఇన్‌చార్జ్ రంగాచార్యులు, సదానంద్‌ఖాకడే, రామలింగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి హాసినికి సన్మానం

నల్లకుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల పంజాబ్ పాటియాలో నిర్వహించిన 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2024–25 అండర్–19 బాస్కెట్ బాల్ పోటీల్లో తెలంగాణ నుంచి అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పద్మశాలి సంఘం నాయకుడు కేఎస్.శ్రీకాంత్ సుధ దంపతుల కుమార్తె కైరంకొండ హాసిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతారావు క్రీడాకారిణిని శాలువాతో సన్మానించి అభినందించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. అలాగే క్రీడాకారులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంబుల శ్రీకాంత్, పద్మశాలి సంఘం నాయకులు ఎస్. నర్సింగ్‌రావు, జయసింహ, మధు, హరి తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో ఆకట్టుకున్న భక్త మార్కండేయ హరికథ గానం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శనివారం సాయంత్రం శ్రీమదజ్జాడ నారాయణదాస వర్యుల 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతులు 126వ జయంతి హరికథ మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం సాయంత్రం జి. మునిలక్ష్మి భాగవతారిణి 'భక్త మార్కండేయ' హరికథా గానం ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై దక్షిణామూర్తి, బి. శ్రీపతి రావు, మృదంగంపై సుధాకర్, తబలాపై నటరాజ్ వాద్య సహకారమందించారు.

నేడు 'ద్రౌపదీ స్వయంవరం'పై హరికథ గానం..

సోమవారం సాయంత్రం ఎస్. చిరంజీవాచార్యులు భాగవతార్‌చే 'ద్రౌపదీ స్వయంవరం'పై హరికథా గానం ఉంటుందని ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య తెలిపారు.

కరాటేను అందరూ నేర్చుకోవాలి

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. 50 మంది విద్యార్థులు ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ శాఖ అడిషనల్ డీసీపీ బుర హాన్ ఆలీ కరాటే బెల్ట్‌లను, సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే వంటి ఆత్మరక్షణ విద్యను బాలబాలికలే కాకుండా మహిలు, అన్ని వయస్సుల వారు నేర్చుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, బ్లాక్‌బెల్టలు కరీం, అమృతరెడ్డి, గణ సంతోషిణి, మహేందర్, రంజిత్‌సింగ్, షైనీ, వెంకట్‌రెడ్డి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

చిక్కడపల్లి: కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్–2024 హైదరాబాద్ అధ్యక్షుడు మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్ పోటీలు జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ జరిగాయి. వివిధ విభాగాల్లో పోటీలు జరిగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రఘు, స్వామి, మనీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ముషీరాబాద్: పేదల సంక్షేమమే ధ్యేమంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.వెంకటేష్, జెనిగే శ్రీనివాస్ యాదవ్, సురేష్‌కుమార్, లింగంగుప్తా, లింగాల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళా మృతి

కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర రాజేంద్రనగర్‌కాలనీకి చెందిన కనకదుర్గ (54) మూడు నెలల క్రితం భర్త జనార్దన్‌రావుతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లడానికి కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కుతూ జారిపడింది. కాలు బెనకడంతో ఆస్పత్రిలో చేర్పించారు. మెడిసిన్ వాడిన నొప్పి తగ్గలేదు. సెప్టిక్ కావడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వైద్యులు ఎంఎల్‌సీ చేయడంతో ఆదివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేశవ్ మెమోరియల్ కళాశాల ప్రాంగణంలో జరిగిన పూజలో అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దీపాలు వెలిగిస్తున్న కిషన్‌రెడ్డి దంపతులు





ఓం శ్రీస్వామియే శరణం అయ్యప్ప

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

- ఆధ్యాత్మిక సాగరాన్ని తలపించిన కేశవ్ మెమోరియల్ ప్రాంగణం
- హాజరైన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు

కాచిగూడ: అమితానందం.. పరమానందం అయ్యప్పా.. నీ శుభరూపం చూసిన.. పాపం తొలగును అయ్యప్పా.. అంటూ భజన కీర్తనలతో నారాయణగూడ ప్రాంతం ఆధ్యాత్మిక సాగరాన్ని తలపించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'కేశవ్ మెమోరియల్ కళాశాల ప్రాంగణం'లో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజ కనులపండువగా జరిగింది. వేదికపై వినాయకుడు, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఉంచి పూజలు జరిపారు. 18 మెట్లపై జ్యోతులను వెలిగించటంతో ఒక్కసారిగా ఆ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన పూజా కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు, ప్రజలు భక్తిభావంతో తరించిపోయారు. వందలాదిగా పాల్గొన్న అయ్యప్పస్వామి మాలధారులు, భక్తుల అయ్యప్ప శరణుఘోషతో హోరెత్తింది. పూజారి ఆత్రేయ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. జడల రమేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి.

మహా పడిపూజను 24 ఏళ్లుగా నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి దంపతులు..

హరిహరసుతుడు అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో శాస్త్ర ప్రకారం నిర్వహించే పూజలు, అర్చనలు హైందవ సంప్రదాయానికి ప్రతీకలు. అత్యంత పవిత్రమైన ఈ వేడుకను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు 24 ఏళ్లుగా ఏటా అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నారు. అయ్యప్ప దీక్ష మత సామరస్యానికి ప్రతీక. కులం, మతం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే దీక్ష పరమార్థం. దీని ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుంది.

కఠిన నియమాలతో దీక్ష..

అయ్యప్ప దీక్ష తీసకున్న వారు కఠిన నియమాలు ఆచరిస్తూ దీక్షాకాలాన్ని పరిపూర్ణం గవిస్తారనే మంచి పేరుంది. ఏటేటా అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాముల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అంతటి మహోన్నతమైన దీక్షలో భాగంగా సంప్రదాయ విశ్వాసం ప్రకారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ప్రతి ఏటా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

పడిపూజకు హాజరైన ప్రముఖులు

అయ్యప్పస్వామి మహాపడిపూజకు భక్తులతో పాటు పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, దణపల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ సీనియర్ నేత ఎనుముల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతం రావు, చింతల రాంచంద్రారెడ్డి, సినినటుడు శివ కృష్ణ, మంద కృష్ణ మాదిగ, కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమా రమేష్‌యాదవ్, జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు సి.నందకిషోర్ యాదవ్, సి.వినోద్ యాదవ్, ఎక్కాల నందు, మేకల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పను పల్లకీలో ఊరేగిస్తున్న కిషన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మందకృష్ణ మాదిగ, భక్తులు

ఉచిత వైద్య శిబిరం

అంబర్‌పేట: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఆదివారం బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్‌లో ఉన్న సాయి దత్తా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పులువురు వినియోగించుకున్నారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఉచిత మందుల పంపిణీ జరిగింది. ఈ వైద్య పరీక్షలను డాక్టర్ ఈఎస్ ధనుంజయ, డాక్టర్ కుమార్, కరిష్మా, పెర్నండజ్ వైద్య పరీక్షలు నిర్వహించి పలు వైద్య సలహాలు ఇచ్చారు.

బిజ్జి శత్రుకు డాక్టరేట్

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బిజ్జి శత్రుకు పోలీస్ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ బి.ఆనంద్‌కుమార్ బిజ్జి శత్రుకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను అందజేసి సన్మానించారు.

రూ.4500 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కాచిగూడ: విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4500 కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఫీజుల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ లేఖ రాసినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారే తప్ప ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న భావిభారత పౌరులు చదువుకునే విద్య ఫీజుల బకాయిలు మాత్రం చెల్లించడం లేదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని కోరారు. ఈనెల 10వ తేదీన జరిగే జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాపాలనకు మద్దతు పెరిగింది



బాగ్‌లింగంపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సంబురాలు జరుపుకుంటున్న పార్టీ నేతలు అరవింద్‌కుమార్ యాదవ్, లోకేష్‌యాదవ్, కాసాని ఆనంద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలో ప్రజాపాలనకు ప్రజల మద్దతు పెరిగిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్నందుకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నాయి అన్నారు. గతంలో జరిగిన అవినీతి పాలనపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల వారికి ఈ ప్రభుత్వంలో సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. రాంనగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి లోకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసాని ఆనంద్, శ్యామ్‌యాదవ్, వాజీద్ హుస్సేన్, అంజియాదవ్, జాహేద్, అజయ్, మీరాభాయ్, రాజు వర్మం, జబ్బార్, నరేష్, ప్రేమ్, మురళీ, అజార్, రవి, గంగాధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జ కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. మహాత్మానగర్‌లో జరిగిన సమావేశంలో పూసరాజు మాట్లాడుతూ.. గంగపుత్రులు ఐక్యంగా ఉన్నప్పుడే తమ డిమాండ్లను సాధించుకోవచ్చని అన్నారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ.. ప్రజా సంఘాలు సామాజిక బాధ్యతతో ప్రజలకు సేవలు అందిస్తూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర ఫెడరేషన్ జిల్లా చైర్మన్ పద్మా, ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శివరత్నం, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు శివాజీ, నర్సింగ్‌రావు, కోశాధికారి శివకుమార్, రాములు, రాజు, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన సర్వే హర్షణీయం



లోక్‌సభ సభ్యుడు రాధాకృష్ణను కలిసిన గౌడ సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహించినందుకు కాంగ్రెస్ పార్టీకి రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ తెలిపింది. ఆదివారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోక్‌సభ సభ్యుడు రామకృష్ణను ఢిల్లీలోని తన నివాసంలో కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్రకన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, నాయకులు వి.నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న కులగణన సర్వేతో పాటు బీసీల అభివృద్ధి, గౌడ్ల సంక్షేమం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. తెలంగాణ రాష్ట్రంలో గౌడలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తీసుకుపోయి వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని వారు కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలి



ముషీరాబాద్: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని భోలక్‌పూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్ధిఖ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో డివిజన్ బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దీన్‌దయాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పార్టీ నేతలు పని చేయాలన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఆలీ, నాయకులు రహీం, మున్వర్‌చాంద్, చాంద్‌పాషా, ఆర్. శ్రీనివాస్, ప్రవీణ్, సాయి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన వారు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

వాల్వ్‌కు మరమ్మతులు

కాచిగూడ: నింబోలిఅడ్డ మెయిన్ రోడ్డు, రహమత్‌బాగ్ బస్తీకి మంచినీరు అందించే వాల్వ్ వారం రోజుల క్రితం చెడిపోవడంతో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం జలమండలి అధికారులు, సిబ్బందితో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ రహమత్‌బాగ్ ప్రాంతానికి పర్యటించి మంచినీటి వాల్వ్‌కు మరమ్మతులు చేయించారు. ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ప్రభాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో డివిజన్ బీఆర్ఎస్ బూత్ స్థాయి కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల అరుణ్‌కుమార్, శివముదిరాజ్, శ్రీకాంత్‌ముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, శ్రీనివాస్, భిక్షపతియాదవ్, సత్యనారాయణ, బాబు, బి.ఎం.శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రంగానగర్ యువజన సేవా సంఘం కమిటీ రద్దు

త్వరలో నూతన కమిటీకి ఎన్నికలు

ముషీరాబాద్: రంగానగర్ యువజన సేవా సంఘం ప్రస్తుత కమిటీ కాలపరిమితి ముగిసినందున కమిటీని రద్దు చేశారు. ఆదివారం రంగానగర్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన కమిటీ ప్రధాన కార్యదర్శి పానుగంటి మహేష్‌కుమార్ మాట్లాడుతూ... నూతన కమిటీని ఎన్నుకునేందుకు త్వరలో తేదీని ప్రకటిస్తామని అన్నారు. ఎన్నికల కమిటీ సభ్యులు వై.మల్లేష్, శంకర్, పెంటయ్య, పరశురాం, ముప్పిడి నర్సింగ్‌రావు, రవికుమార్ నియమించామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సేవ చేయాలనే తపన కలిగిన వారు పోటీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు ధర్మేందర్, కిషోర్, నాగేష్, మల్లేష్, దుర్గాప్రసాద్, మహేష్, నరేష్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నమెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ వీరబాయి


అంబర్‌పేట: సీఎం కప్ టోర్నమెంట్‌ను అంబర్‌పేట మండల స్థాయిలో ఈనెల 10 నుంచి 12వ తేదీల్లో చేపట్టనున్నట్లు తహసీల్దార్ వీరబాయి తెలిపారు. ఆదివారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో క్రీడ పోటీలపై సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆసక్తి గల విద్యా సంస్థలు, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం కప్ టోర్నమెంటులో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 10వ తేదీలో అంబర్‌పేట మండల కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడలను అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో, జింఖానా గ్రౌండ్‌లో అథ్లెట్స్ క్రీడలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు క్రీడల ఇన్‌చార్జి ఫోన్ నం.95505 46635లో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

కవాడిగూడ: కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, యువజన కాంగ్రెస్ విభాగం ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు విజయోత్సవాలలో భాగంగా ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాపార్కు చౌరస్తా, బీమా మైదాన్, ఎల్ఐసీ కాలనీ, గాంధీనగర్, ఎస్‌బీఐకాలనీ, బీఎస్‌నగర్, లోయర్ ట్యాంక్‌బండ్, కవాడిగూడ మీదుగా ముషీరాబాద్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌తో పాటు ముషీరాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించారు.

◆ అనంతరం గౌరీ సతీష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. దాదాపు 60వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కనీసం ప్రమోషన్లకు నోచుకోని ఉద్యోగులకు అర్హతను బట్టి ప్రమోషన్లు కల్పించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అదే విధంగా కవాడిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు భాస్కర్, నగర ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన విజయోత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు వీడీ కృష్ణ, అంజియాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి, పి.లక్ష్మణ్, రమేష్, ప్రభాకర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా పార్కు చౌరస్తాలో విజయోత్సవ ర్యాలీ సందర్భంగా మాట్లాడుతున్న గౌరీసతీష్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కవాడిగూడ: బండమైసమ్మ నగర్‌లోని విజయగణపతి ఓంకారేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు వేద మంత్రోచ్చరణల నడుమ ధ్వజస్తంభం, సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయ, నాగదేవత విగ్రహాలతో పాటు నవగ్రహ, శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఈ పూజలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చికోటి శ్రీనివాస్‌లు, ఎంవీ కృష్ణుడు, ఆనంద్, భువనగిరి నవీన్, కిరణ్, వెంకటేష్, వివేక్, పవన్‌కుమార్, కె.నాగేశ్వర్‌రావు, బి.వెంకట్‌రెడ్డి, సిహెచ్ హనుమంత్, కె. నారాయణ, నాయకులు మహేందర్ బాబు, శ్యామ్‌యాదవ్, ఎండీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





పూజల్లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్